సాక్షి సిద్దిపేట

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



ఆపద్బాంధవులు

అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తూ యువత ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివరాలు 8లో ▸



'అమ్మ ఆదర్శం..' జాప్యం

ప్రభుత్వ పాఠశాలల్లో 'అమ్మ ఆదర్శ'ం కింద చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు.

వివరాలు 9లో ▸



సేవాలాల్ మార్గం..

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయమని గిరిజన నేత అన్నారు.

వివరాలు 9లో ▸

కోళ్లు పెంచుదామా? వద్దా?

డైలమాలో పౌల్ట్రీ రైతులు

- బర్డ్ ఫ్లూ దెబ్బతో విలవిల
- ఉత్పత్తుల తరలింపులోనూ తీవ్ర జాప్యం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో దుస్థితి
- తెలుగు రాష్ట్రాల కోళ్ల ఉత్పత్తుల్లో సింహభాగం ఇక్కడే

బర్డ్ ఫ్లూ దెబ్బతో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. సొంతంగా పరిశ్రమను నడుపుకుంటున్నవారు తీవ్రంగా నష్టపోయారు. వీరంతా కోళ్ల ఉత్పత్తిని తిరిగి ప్రారంభించాలా? వద్దా? అనే డైలమాలో పడ్డారు. మరోవైపు ఇంటిగ్రేషన్ రైతులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. బర్డ్ ఫ్లూ ప్రచారం నేపథ్యంలో కంపెనీలు ఉత్పత్తులను లిఫ్టింగ్ చేయడానికి సమయం తీసుకుంటున్నాయి. దీనివల్ల నిర్వహణ భారం రైతులకు తప్పడం లేదు. కోళ్ల ఉత్పత్తుల్లో తెలుగు రాష్ట్రాల్లోనే అగ్రగామిగా వర్ధిల్లుతున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పరిస్థితి ఇది.



గజ్వేల్: పౌల్ట్రీ రంగాన్ని తరుచూ ఏదో అంశం కుదిపేస్తూనే ఉంది. తాజాగా బర్డ్‌ఫ్లూ ప్రచారంతో ఈ పరిశ్రమకు గట్టి దెబ్బే తగలింది. ఉమ్మడి మెదక్ జిల్లా(సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్)లో వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ వెలుగొందుతోంది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఉత్పత్తులను ఈ ప్రాంతం అందిస్తున్నది. పౌల్ట్రీపై ప్రతి నెలా వందల కోట్ల రూపాయల మేర లావాదేవీలు సాగుతున్నాయి. ఎంతోమంది రైతులు దశాబ్దాలుగా సొంతంగా పరిశ్రమను నిర్వహిస్తున్నారు. పౌల్ట్రీనే తమ జీవితంగా మలుచుకున్నారు.

కంపెనీల మాయాజాలం

ఇంటిగ్రేషన్ కంపెనీల మాయాజాలంతో సొంతంగా పౌల్ట్రీ పరిశ్రమను నిర్వహిస్తున్న రైతులను కుంగదీస్తున్నది. రైతు నుంచి తక్కువ ధరకు కోళ్లను కొనుగోలు చేస్తున్న కంపెనీలు బహిరంగ మార్కెట్‌లో ధరలు పెంచి అమ్ముకుంటున్నాయి. ఇక పోతే జిల్లాలో వేలాది మంది రైతులు సుగుణ, వెంకటేశ్వర, డైమాండ్, జాహ్నవి, జానకీ, ఎస్ఆర్, స్నేహ, విమల తదితర ఇంటిగ్రేషన్ సంస్థల భాగస్వామ్యంతో పౌల్ట్రీ పరిశ్రమ నడుపుతున్నారు. ఈ సంస్థలతో పరిశ్రమను నడుపుకోవాలనుకుంటే రైతులు షెడ్, లేబర్, కరెంట్, నీరు వంటి మౌలిక వసతులను కల్పించాల్సి ఉంటుంది. దీనికి ఒక్కో కోడిపై కిలోకు రూ.5–6కుపైగా చెల్లిస్తాయి. నిర్వహణ బాగుంటే మరో 50పైసలు అదనంగా చెల్లిస్తారు. ఇదిలాఉంటే ఇంటిగ్రేటెడ్ సంస్థల ఒప్పందం ప్రకారం ఉత్పాదక వ్యయం భారీగా పెరిగితే మాత్రం రైతులు నష్టాలు భరించాల్సి ఉంటుంది. 5శాతం కోళ్లకంటే ఎక్కువగా మృత్యువాతపడితే నష్టాలను రైతులే భరించాలి. విద్యుత్ ఛార్జీల రూపేణా 5వేల కోడిపిల్లల సామర్థ్యం కలిగిన షెడ్‌కు 45రోజులకు రూ.5వేల పైనే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నింటినీ మినహాయిస్తే ఈ సంస్థల భాగస్వామ్యంతో కోళ్లను పెంచుతున్న రైతులకూ మిగులుతున్నది అంతంత మాత్రమే. పౌల్ట్రీ రంగంలో వరుసగా వస్తున్న నష్టాలను నియంత్రించడానికి రైతులకు కరెంట్, దాణాలో సబ్సిడీ ఇవ్వాలనే డిమాండ్ ఎన్నోఏళ్లుగా ప్రభుత్వం ముందు ఉన్నది. కానీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువడటంలేదు.

ఒక్కో కోడిపై రూ.195కుపైగా ఖర్చు..

సాధారణంగా కోడి పిల్లలను 45రోజులు పెంచుతారు. చిక్స్ రూ.45, దాణాకు (కోడి పెరిగేంతవరకు) రూ.140, ఇతర ఖర్చులు మరో రూ. 10కి పైగా ఖర్చు అవుతున్నది. ఈ లెక్కన ఒక్కో కోడిని ఉత్పత్తి చేయడానికి అన్నీ కలుపుకొని రూ.195కిపైగా ఖర్చవుతున్నది. సుమారు రెండు కిలోలకుపైగా బరువుండే లైవ్ బర్డ్స్ ధర రూ.220కి పైగా పలికితే నష్టాలు ఉండవు. కానీ ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో లైవ్ బర్డ్ ధర రైతుల నుంచి తీసుకెళ్లే కంపెనీలు కిలోకు రూ.52 మాత్రమే చెల్లిస్తున్నాయి. అంటే రెండు కిలోల బరువుంటే లైవ్ బర్డ్‌కు రూ.104మాత్రమే ధర దక్కుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో సొంతంగా పరిశ్రమను నడుపుకునే వారు లక్షల్లో నష్టాలు చవిచూస్తున్నారు. ఇలాంటి కోవకు చెందిన వారంతా ప్రస్తుతం కొత్త కోడి పిల్లల ఉత్పత్తిని ఆపేశారు.

ఉత్పత్తిని తాత్కాలికంగా ఆపేశా..



30 ఏళ్లుగా పౌల్ట్రీ రంగంలో ఉన్నాను.16వేల కోళ్ల సామర్థ్యం గల షెడ్డు నిర్వహిస్తున్నా. 15 రోజుల కిందటే అన్ని కోళ్లను అమ్మేశాను. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ ప్రచారం నేపథ్యంలో కొత్త కోడిపిల్లల ఉత్పత్తిని ఆపేద్దామని నిర్ణయించుకున్నా. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి ఉత్పత్తిని ప్రారంభిస్తా.

– వెంకటరెడ్డి పౌల్ట్రీఫామ్ నిర్వాహకుడు, ఇందుప్రియాల్, దౌల్తాబాద్ మండలం

న్యూస్‌రీల్

కడియం శ్రీహరి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కడియం

చేర్యాల(సిద్దిపేట): స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ నాయకురాలు సింగాపురం ఇందిర అన్నయ్య కర్రొల్ల భాస్కర్ ఈ నెల 14న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం పట్టణకేంద్రానికి వచ్చి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనవెంట మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడి సస్పెన్షన్



సస్పెన్షన్ విషయాన్ని ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్: ఎమ్మార్పీఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణమాదిగ, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శనిగరి రమేశ్‌మాదిగలను సస్పెండ్ చేసినట్లు ఆ సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివమాదిగ ప్రకటించారు. ఆదివారం గజ్వేల్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వీరు పనిచేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈనేపథ్యంలోనే వారిపై జరిపి, మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌మాదిగ, సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బోనాలతో స్వాగతం



కవితకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ శ్రేణులు బోనాలతో ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తుండగా కుకునూరుపల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పూల మాల వేసి జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అక్కడి నుంచి రాజీవ్ రహదారిపై ఉన్న రవీంద్రనగర్ చౌరస్తా వద్దకు కవిత చేరుకోగానే మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా సిద్దిపేటకు వెళ్లారు. కవిత రాకతో ట్రాఫిక్‌కు 20నిమిషాల పాటు అంతరాయం ఏర్పడింది.

ఉప కాల్వ ద్వారా సాగు నీరు అందించండి



వెంకటయ్యకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక పట్టణ శివారులో ఉన్న సుమారు 600 ఎకరాల వ్యవసాయ భూములకు మల్లన్న సాగర్ ఉప కాల్వ ద్వారా సాగు నీటిని అందించాలని రైతులు కోరారు. ఈమేరకు అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు ఆదివారం రైతులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో దుబ్బాక బాబూ జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షుడు రాజమల్లు, ఉపాధ్యక్షుడు జోగయ్య, కోశాధికారి యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

కాలి బూడిదైన ఈత చెట్లు

గజ్వేల్‌రూరల్: ఈత చెట్లను దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అహ్మదీపూర్‌కు చెందిన గౌడ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు నర్సాగౌడ్ మాట్లాడుతూ గ్రామ సమీపంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద 500 ఈత చెట్లను పెంచి వాటి ద్వారా ఉపాధి పొందుతున్నామన్నారు. ఈ క్రమంలో ఆదివారం 40 చెట్ల వరకు కాలిపోయినట్లు సంఘం సభ్యులు గుర్తించారని, ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దూర విద్యను దగ్గరకు చేర్చింది

సిద్దిపేటఎడ్యుకేషన్: దూర విద్యను డిజిటల్‌గా మార్చి దగ్గరకు చేర్చిన ఘనత బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకే దక్కిందని రిజిస్ట్రార్ డాక్టర్ విజయకృష్ణారెడ్డి అన్నారు. స్టూడెంట్ సర్వీస్ సెల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆదివారం ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట స్టడీ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ అపార్ నమోదులో దేశంలోనే అంబేడ్కర్ యూనివర్సిటీ ముందుందన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ వైపునకు మరలకుండా వారిలో చైతన్యాన్ని తీసుకురావాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కౌన్సిలర్లు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. త్వరలోనే సిద్దిపేట స్టడీ సెంటర్‌కు ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి శ్రీకారం చుట్టిన స్టడీ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందంను అభినందించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఎల్లం, రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పూర్వవిద్యార్థులతో ఓయూ రిజిస్ట్రార్ ఎల్‌వీకె రెడ్డి తదితరులు

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గజ్వేల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన యువత కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. కులగణన సర్వే చరిత్రాత్మకమని చెప్పారు. ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీల వర్గీకరణను సైతం కాంగ్రెస్ పూర్తి చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ తీసుకుంటున్న నిర్ణయాలు విశేష ప్రజాదరణ పొందుతుండగా, ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు శివారెడ్డి, మల్లేశంగౌడ్‌ల అధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో నర్సారెడ్డి

రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- 317 జీఓకు వ్యతిరేకంగా పోరాడింది బీజేపీయే
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలన, రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సిద్దిపేట గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. పట్టభద్రులు, టీచర్లు సామాజిక దృక్పథం ఉన్నవారని, ఎవరిని ఎన్నుకుంటే బాగుంటుందోననే ఆలోచనతో ఓటు వేస్తారన్నారు. ఉపాధ్యాయుల బదిలీల సమయంలో 317 జీఓను తీసుకువస్తే దానికి వ్యతిరేకంగా పోరాడింది బీజేపీయేనని గుర్తు చేశారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ టీచర్ల దుఃఖానికి కారణమవుతుందని అన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి నాణ్యమైన యువశక్తిని తయారు చేయాలనే సంకల్పంతో బడ్జెట్‌లో రూ.4లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మకు ఎంపీ పూజలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లు తమ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనిల్‌కుమార్‌యాదవ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి అమ్మవారి సారె, ప్రసాదం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న తర్వాత కొండపోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. 5వ వారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరి, చిన్న, సుధాకర్, లక్ష్మణ్, చందు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు



మల్లన్నకు పట్నాలు.. భక్తుల మొక్కులు



మల్లన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో ఆదివారం భారీగా తరలివచ్చారు. భక్తులు తలనీలాలు సమర్పించి, పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. గంగిరేణు చెట్టు వద్ద బోనాలు సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది గుట్టపై ఉన్న రేణుక ఎల్లమ్మకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. స్వామి ధర్మదర్శనానికి సుమారు 4గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఎపిటోమ్ కంపెనీ అధినేత కాంత జైపాల్ శ్రీవిద్య దంపతులు స్వామి వారికి 14 కిలోల వెండి ప్రతిమలు అందజేశారు. – కొమురవెల్లి (సిద్దిపేట)

సర్వేను సద్వినియోగం చేసుకోండి

చేర్యాల(సిద్దిపేట): సమగ్ర కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలని మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్ సూచించారు. ఆదివారం సర్వే ప్రారంభం సందర్భంగా స్థానిక కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని వారు 28 వరకు జరిగే సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

'స్వశక్తి'కి బిల్లులేవి?

స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధించాలని స్వశక్తి సంఘాల మహిళలు ఆశపడ్డారు. అధికారులు చెప్పగానే నెలనెలా ఉపాధి పొందవచ్చని టైలరింగ్ ప్రారంభించారు. అయితే మహిళల చేత కుట్టుపని చేయించిన అధికారులు బిల్లులు ఇప్పించడంలో మాత్రం ముఖం చాటేస్తున్నారు. దీంతో స్వశక్తి మహిళల్లో అసహనం వ్యక్తమవుతోంది.

- జిల్లాలో సంక్షేమ హాస్టల్ విద్యార్థుల దుస్తుల సరఫరా
- నాలుగేళ్ల నుంచి రూ.34.80 లక్షల బిల్లులు పెండింగ్‌లోనే
- టోకెను ఇచ్చిన ఖాతాలో జమకాని డబ్బులు



హుస్నాబాద్‌రూరల్: జిల్లాలోని 18 బీసీ, 21 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలోని దాదాపు 1500 మంది విద్యార్థులకు యేడాదికి నాలుగేసి డ్రెస్సులను స్వశక్తి మహిళలు కుట్టి అందించారు. వారికి ఇప్పటి వరకు రూ.34.80లక్షల బిల్లులు రావాల్సి ఉంది. వ్యవసాయ కూలీ పనులు మానేసి బట్టలు కుట్టే పనిచేశామని, నాలుగేళ్ల నుంచి బిల్లులు రాకపోతే ఇల్లు ఎట్లా గడుస్తుందని ఆ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో అరుంధతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో 30 మంది సభ్యులు స్త్రీ శక్తి టైలరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. డీఆర్‌డీఏ అధికారులు మహిళాసంఘాల సభ్యులు అందరూ స్వయం ఉపాధి పొందాలని చెప్పగానే మొదట పోతారం మహిళలు ముందుకు వచ్చి స్త్రీ నిధి రుణాలను తీసుకొని మిషన్లు కొనుగోలు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కుట్టు శిక్షణతో ఉపాధి పొందిన మహిళలకు మొదట బిల్లులు బాగానే వచ్చేవి. అయితే నాలుగేళ్ల నుంచి రూ.30లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కుట్టు పనినే నమ్ముకొన్న ఆ మహిళలకు పిల్లల స్కూల్ ఫీజులు, నెలనెలా రుణాలు చెల్లించడం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీసీ సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థుల డ్రెస్సులు ఈ యేడాది ఇవ్వకపోయినా పాత బిల్లులు చెల్లించడం లేదని మహిళలు వాపోతున్నారు.

పెండింగ్‌లో రూ.1.80 లక్షల బిల్లులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల డ్రెస్సులు కుడితే ఒక్కొక్క డ్రెస్సుకు రూ.75లు ఇస్తామని చెప్పిన అధికారులు రూ.50ల చొప్పున చెల్లించారు. మిగతా రూ.25ల చొప్పున రూ.3లక్షల వరకు రావల్సి ఉంది. వాటితో పాటు ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల డ్రెస్సులు కుట్టుపని అప్పగించడంతో వారికి 2024 సెప్టెంబరులోనే డ్రెస్సులు అందించారు. అయినా నేటికీ రూ.1.80లక్షల బిల్లులు ప్రభుత్వం చెల్లించలేదు. అధికారులు బిల్లులు చెల్లించి మహిళలను ఆదుకోవాలని కోరుతున్నారు.

మిషన్ కుడితేనే ఇల్లు గడుస్తది



బట్టలు కుడితే రోజుకు రూ.1500 నుంచి రూ.2వేలు వస్తయి. ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి బిల్లులు ఇయ్యక పోవడంతో నెలనెలా మహిళా సంఘం రుణం చెల్లించడం ఇబ్బంది అవుతోంది. కుట్టుపని ఉందని బయట కూలిపనికి పోతలేం. పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టుడు కూడా తిప్పలైతంది. బిల్లులు వస్తాయని అప్పులుచేస్తే వాటికి వడ్డీలు పెరుగుతున్నా బిల్లులు రావాయె.. అవసరం తీరదాయే. – పి.లక్ష్మి, పోతారం(ఎస్)

సచివాలయం చుట్టూ తిరగాలంటే ఎట్లా..



హాస్టల్ విద్యార్థుల డ్రెస్సులు కుట్టిన బిల్లులు రూ.30 లక్షలు రావాల్సి ఉంది. ఆఫీసుల చుట్టూ తిరిగితే బీసీ సంక్షేమశాఖ రూ.10లక్షలు, ఎస్సీ సంక్షేమశాఖ రూ..10లక్షలకు టోకెన్స్ ఇచ్చాయి. మూడు నెలలు గడిచినా డబ్బులు జమకాలేదు. టోకెన్ పట్టుకొని హైదరాబాద్ సచివాలయం చుట్టూ తిరగాలంటే ఎట్లా అయితది. తక్షణం కలెక్టర్ చొరవ చూపాలి. – కనకతార, సీఏ, పోతారం

క్లుప్తంగా

తండ్రి మృతిపై అనుమానం


గోపాల్

పటాన్‌చెరు టౌన్: తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమారుడు ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలం లింగాయపల్లి సొమ్లా తండాకు చెందిన బానోత్ గోపాల్ 10 సంవత్సరాల క్రితం భార్య లక్ష్మి, పిల్లలతో కలిసి అమీన్‌పూర్‌కు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 14 రాత్రి గోపాల్ చెత్త పడేసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గోపాల్ కోసం స్థానికంగా వెతుకుతుండగా 15వ తేదీ సాయంత్రం అమీన్‌పూర్ గ్రేవీ యార్డ్ వెనుక ఉన్న రాళ్లలో గోపాల్ మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమారుడు బానోత్ సుధీర్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివాము, స్ప్రింక్లర్లు దగ్ధం



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. వ్యవసాయ భూములలో ఎలాంటి పంటలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని పోతారం శివారు వరకు వ్యవసాయ భూములలో మంటలు వ్యాపించి కట్కూరు శంకర్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ప్రశాంత్‌కు చెందిన ఆయిల్ పామ్ చెట్లు, స్ప్రింక్లర్ పైపులు దగ్ధమయ్యాయి. సకాలంలో రైతులు మంటలను ఆర్పివేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

సిద్దిపేటరూరల్: మెడలో నుంచి బంగారు గొలుసు తస్కరించేందుకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన పోలిస్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం చోటు చేసుకుంది. చిన్నగుండవెల్లికి చెందిన మంద శంకరవ్వ ఆదివారం తన వ్యవసాయ భావి వద్దకు వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో శంకరవ్వకు ఎదురుగా గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి సిద్దిపేటకు ఎలా వెళ్ళాలి అని అడగడంతో వివరాలు చెప్పింది. దీంతో వెళ్లిపోయినట్లు నటించిన వ్యక్తి మళ్లీ శంకరవ్వ వద్దకు వచ్చి మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసుని లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో గట్టిగా అరవడంతో అటుగా వెళ్తున్న గ్రామస్థులు అక్కడికి వచ్చారు. గమనించిన దొంగ బైక్‌పై పారిపోయాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

నూరేళ్ల వృద్ధుడు మృతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ గ్రామంలో నూరేళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు మృతి చెందాడు. సి. పెంటారెడ్డి(100) భార్య నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు ఒక కొడుకు. కుమారుడు మృతి చెందగా కోడలు మనవళ్లు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయనకు ఉర్దూ, తెలుగు భాషలపై మంచి పట్టు ఉంది. గ్రామస్తులతో స్నేహపూర్వకంగా ఉంటూ దేశ స్వాతంత్ర్యం, నిజాంరాజు గురించి ప్రజలకు వివరించే వారు. రోడ్డుపై వెళ్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డాడు. అప్పటి నుంచి మంచం పట్టి మృతి చెందాడు.

ఆపద్బాంధవులు!

- అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తున్న యువత
- ఐదు వందల మంది సభ్యులు.. రెండు వేల మందికి రక్తదానం
- ఆదర్శంగా నిలుస్తున్న సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్



రక్తదానం చేస్తున్న సంగారెడ్డి బ్లడ్ డోనార్స్ సభ్యులు(ఫైల్)

సంగారెడ్డి రూరల్: మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని ఆదర్శంగా తీసుకుని రక్తదానం చేస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు ఆ యువకులు. వాట్సాప్‌లో ఓ గ్రూపును ఏర్పాటు చేసుకుని ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు. సంగారెడ్డి పట్టణానికి చెందిన జనజాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బంగారు కృష్ణ సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్‌ను 2019లో ప్రారంభించారు.

పన్నెండు మందితో ప్రారంభించిన ఈ క్లబ్‌లో ప్రస్తుతం 500 మందికి పైగా బ్లడ్ డోనర్లు ఉన్నారు. ఎవరికైనా రక్తం అత్యవసరమైతే ఈ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేస్తే చాలు అందుబాటులో ఉన్న వారు వచ్చి రక్తదానం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతున్నారు. ఇలా సుమారు ఆరు సంవత్సరాలుగా ఈ సేవ చేస్తున్నారు.

రక్తం ఎంతో విలువైనది.

ఒక యూనిట్ రక్తంతో ఒకరి ప్రాణాలు కాపాడచ్చు. ప్రమాదంలో గాయపడ్డ వారికి, గర్భిణులకు రక్తం ఎంతో అవసరం. క్లిష్ట పరిస్థితుల్లో ఆయా గ్రూప్ రక్తం అందుబాటులో లేకపోతే ప్రాణాలే పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయంలో మేమున్నామంటూ బ్లడ్ డోనర్స్ క్లబ్ యువత ముందుకొచ్చి రక్తదానం చేస్తూ ప్రాణాలను నిలబెడుతోంది.

ప్లాస్మాదానం కూడా..

కరోనా మహమ్మారి అనేక మంది ప్రాణాలను బలితీసుకుంటున్న రోజుల్లో కూడా డోనర్స్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ వైరస్ బారిన పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్లాస్మాదానం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడారు.

అపోహలు వద్దు..



కొందరు రక్తం ఇస్తే అనారోగ్యం పాలవుతా రని అనుమానాలు పెట్టు కుంటారు. ఇవన్నీ అపోహలు మాత్రమే. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి నాలుగు నెలలకు ఒకసారి బ్లడ్ డొనేట్ చేయవచ్చు. డొనేట్ చేసిన వెంటనే బ్లడ్ ఉత్పత్తి అవుతుంది. ఏలాంటి వ్యాధులు, అనారోగ్య సమస్యలు ఉండవు.

-డాక్టర్ అనిల్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

నేనూ ఇస్తూ.. ఇతరులతో ఇప్పిస్తాను



నా మిత్రుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పుడు అత్యవసర సమయంలో ఎవరిని అడిగిన రక్తం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రావద్దని బ్లడ్ డోనర్స్ క్లబ్‌ను ప్రారంభించాను. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి నేను రక్తం ఇవ్వడంతోపాటు, స్నేహితులతో రక్తదానం చేయిస్తుంటాను.

- బంగారు కృష్ణ, సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు

ఆపద వస్తే.. వచ్చేస్తాడు



జోగిపేట ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛందగా రక్తదానం చేస్తున్నాను అత్యవసరంలో ఎవరు ఫోన్ చేసిన లేదా గ్రూప్‌లో మెసేజ్ పెట్టిన నాకు సంబంధించిన బ్లడ్ అయితే వెళ్లి ఇస్తాను. వేరే గ్రూప్ ఏదైనా అయితే నా స్నేహితులతో ఇప్పిస్తాను. ఇప్పటివరకు ఇరవై సార్లు రక్తమిచ్చాను.

- కిషోర్, ప్రభుత్వ ఉద్యోగి

ఎనిమిది సార్లు రక్తమిచ్చాను



ఒక ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాను. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే సంతృప్తిగా ఉంటుంది. మా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి రక్తదాన శిబిరంలో పాల్గొంటాను. నాతో పాటు కంపెనీలో పని చేసే వారితో కూడా రక్తదానం చేయిస్తుంటాను. ఇప్పటి వరకు 8 సార్లు బ్లడ్ డొనేట్ చేశాను.

-సాయికుమార్ పుల్‌కల్ మండలం, బస్వాపూర్

116 టన్నుల ఇసుక డంపులు స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు


ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): అక్రమంగా ఇసుకను డంపు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు సంయుక్తంగా ఆదివారం దాడిచేసి మూడు చోట్ల అక్రమ డంపులను స్వాధీనం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన కొండపాక మండలంలోని రవీంద్రనగర్ శివారులో రాజీవ్ రహదారికి సమీపాల్లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం.. రవీంద్రనగర్‌కు చెందిన తులశం పోశయ్య, కొమిరి మహేశ్, బోదాస్ నరేశ్ కొంత కాలంగా రాజీవ్ రహదారికి సమీపంలోని రహస్య ప్రదేశాలలో అక్రమంగా ఇసుకను డంపు చేస్తూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి మూడు చోట్ల దాడులు చేసి 116 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను, మట్టిని, మొరం, రేషన్ బియ్యాన్ని రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, గంజాయి తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

చేర్యాల(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని ముస్త్యాలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కేసిరెడ్డి బాల్‌రెడ్డి ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటితాళం పగులగొట్టి ఉందన్న సమాచారం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆయన వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గమనించిన ఆయన వెంటనే చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. చోరీలో 5 గ్రాముల బంగారు ఉంగరం, రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. అదే గ్రామంలో మరో ఇంటి తాళం కూడా పగులగొట్టినట్లు సమాచారం. ఆ ఇంట్లో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాకపోవడంతో ఫిర్యాదు చేయలేదు.

పోలీసులకు దొంగల అప్పగింత


పోలీసుల అదుపులో దొంగలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పెద్ద గొట్టిముక్కుల శివారులోని భవ్యస్ ఫార్మా కంపెనీలో స్క్రాప్‌ను దొంగిలిస్తున్న వారిని కంపెనీ యజమాని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాత్రి నలుగురు వ్యక్తులు కంపెనీలోకి చొరబడి స్క్రాప్, ఐరన్ రాడ్లు, కేబుల్ వైర్లను దొంగిలించి గోడపై నుంచి బయటకు వేస్తుండగా కంపెనీ యజమాని సీసీ కెమెరాలో గమనించాడు. వెంటనే సెక్యూరిటీని అప్రమత్తం చేశాడు. అనంతరం కంపెనీ వద్దకు చేరుకొని సిబ్బందితో కలిసి దొంగలను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. రెండు బైకులను సైతం అప్పగించారు. కొద్ది రోజులుగా కంపెనీ నడవడం లేదు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన ముగ్గురు.. అందులో ఒకరు బీహార్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వీరు చుట్టుపక్కల గ్రామాల్లో వ్యవసాయ బోర్ల వద్ద స్టార్టర్లు కేబుల్ వైర్లు దొంగిలించారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ యజమాని ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోరు మోటారు వేసేందుకు వెళ్లి..

- ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి
- తున్కిబొల్లారంలో ఘటన


యాదగిరి(ఫైల్)

ములుగు(గజ్వేల్): కౌలుకు తీసుకున్న పొలం వద్ద బోరు మోటారు వేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి కౌలు రైతు మృతి చెందిన ఘటన మండలం తున్కిబొల్లారంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసి. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన బొమ్మ యాదగిరి(55)కి భార్య యాదమ్మ, కొడుకు నాగరాజు ఉన్నారు. పొరుగునే ఉన్న తున్కిబొల్లారంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాడు. శనివారం భార్య, కొడుకుతో కలసి పొలం వద్దకు వెళ్లిన యాదగిరి బోరు మోటారు వేసి వస్తానని చెప్పి బావివద్దకు వెళ్లాడు. అతను తిరిగి రాకపోవడంతో భార్య, కొడుకు పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ జాడ తెలియలేదు. బోరు బావి గడ్డమీద యాదగిరి తువాల కనపడటంతో అతను ప్రమాదవశాత్తు బావిలో పడి ఉంటాడని వెతికారు. బావిలో యాదగిరి మృతదేహం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకుకు వెళ్తున్నట్లు చెప్పి..

మహిళ అదృశ్యం


యాదమ్మ(ఫైల్)

వర్గల్(గజ్వేల్): బ్యాంకులో డబ్బులు తీసుకునేందుకు వెళ్లిన మహిళ ఆచూకీ తెలియకుండా పోయింది. వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఆదివారం మిస్సింగ్ కేసు నమోదైంది. గౌరారం ఏఎస్ఐ పోచాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరిపల్లికి చెందిన దార యాదమ్మ(40) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఆమె కూలీ పని చేస్తున్నారు. శనివారం ఉదయం బ్యాంకులో డబ్బుల కోసం వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆ తరువాత ఇంటికి తిరిగిరాలేదు. ఆమె కుమారుడు సాయికుమా ర్ తల్లి నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. దీంతో ఆందోళనకు గురై తల్లి జాడ కోసం అంతటా వెతికినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆదివారం గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన ఆదివారం మండలంలోని తాళ్లపల్లిగడ్డ తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ధనావత్ రాంచందర్ ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, అతని భార్య విజయ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛవ్యాధి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


శేఖర్

ములుగు(గజ్వేల్): మూర్ఛవ్యాధి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం బండమైలారంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. బండమైలారం గ్రామానికి చెందిన తుడుం శేఖర్ కొంత కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో 12న రాత్రి స్థానిక రేషన్ దుకాణం వద్ద శేఖర్ వాంతులు చేసుకుంటుండగా గ్రామస్తులు గమనించి అతడి భార్య లతకు తెలిపారు. వెంటనే ఆమె అక్కడికి చేరుకొని ప్రశ్నించగా మూర్ఛవ్యాధి, ఆరోగ్య సమస్యలను తట్టుకోలేక పురుగుల మందును తాగినట్లు శేఖర్ చెప్పాడు. దీంతో అతడిని వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా అక్కడి వైద్యులు సూచించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శేఖర్ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కొండపాక(గజ్వేల్): గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెలికట్ట గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జి కింద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు (65) అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు వృద్ధుడిని 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని ఒంటిపై తెలుపు రంగు షర్టు, బూడిద రంగు ప్యాంట్ ధరించి తెల్లటి గడంతో ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంను ఢీకొట్టిన కారు, ఒకరి మృతి

నలుగురికి తీవ్ర గాయాలు


మృతుడు సురేశ్


డీసీఎంను ఢీకొట్టిన కారు

కొండపాక(గజ్వేల్): డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఓ కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట(ప్రగతినగర్)లో ముగ్గురు అన్నదమ్ములు చంద వెంకటేశ్, భీమయ్య, సురేశ్ నివాసం ఉంటున్నారు. వారు సెంట్రింగ్ కాంట్రాక్టు పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ నెల 13న భీమయ్య కుమారుడి వివాహం జరిగింది. కొమురంభీం జిల్లా కౌటులం గ్రామంలో వివాహ అనంతరం జరిగే కార్యక్రమం నిమిత్తం అన్నదమ్ముల కుటుంబ సభ్యులు, వారి బంధువులు వేర్వేరు కార్లలో ఆదివారం ఉదయం బయలు దేరారు. ఈ క్రమంలో మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి ప్రక్కన ముందు ఆగిన ఓ డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో కారు డ్రైవరు ప్రక్క సీట్లో కూర్చున్న చంద సురేశ్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకొని అక్కడికి చేరిన పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సదాశివపేటకు చెందిన డీసీఎం డ్రైవరు మన్సూర్ అలీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు డివైడర్‌ను...


మృతి చెందిన అశోక్‌పాటిల్

కంగ్టి(నారాయణఖేడ్): ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కంగ్టి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాద ఘటన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకా భూతన్‌హిప్పర్గా గ్రామానికి చెందిన అశోక్‌పాటిల్(58) కంగ్టి మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామంలో బంధువుల పెళ్లి నిశ్చితార్థం కోసం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగుప్రయాణంలో వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతోపాటు అక్కడికక్కడే స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం ఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి


మృతి చెందిన వెంకటేశ్

గజ్వేల్‌రూరల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గజ్వేల్–పిడిచెడ్ మార్గంలో ఆదివారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్గూరుకు చెందిన వెంకటేష్‌తో పాటు అతని బంధువులైన గొట్టిముక్కలకు చెందిన వెంకటేశ్ (40), నాని, సాయిగౌడ్‌లు గజ్వేల్ నుంచి కారులో కొల్గూరు వైపు వస్తున్నారు. బయ్యారం చౌరస్తా మీదుగా మేథినీపూర్ వచ్చేందుకు బయలుదేరగా గజ్వేల్–పిడిచెడ్ మార్గంలో ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గొట్టిముక్కలకు చెందిన వెంకటేష్ తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. ప్రమాద విషయం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రామాయంపేటలో మరొకరు..


నవీన్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కాస నవీన్ (28) శనివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా.. వెనుకనుంచి అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భయం వీడు.. విజయం తోడు


ఇంటర్ కళాశాలలో విద్యార్థులు

- ఇంటర్, పదో విద్యార్థులకు కౌన్సెలింగ్
- టెలీమానస్‌తో ఆత్మవిశ్వాసం నింపుతున్న నిపుణులు

సంగారెడ్డి క్రైమ్: విద్యార్థి జీవితంలో 10వ తరగతి, ఇంటర్ కీలక మలుపు. ప్రస్తుతం వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కొంతమంది విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారు. పరీక్ష అంటే భయం, వచ్చిన మార్కులపై నిరాశ, చదివిన అంశాలు గుర్తుకు ఉండటం లేదని భావన, ఇతర విద్యార్థులతో పోలిస్తే తము వెనుకబడిపోతున్నాం ఆలోచనలతో ఉంటున్నారు. ఈ క్రమంలో క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. భయాన్ని పక్కన పెట్టి మీకు ఎంత తెలుసో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.. ఫెయిలైతే జీవితం అక్కడితో ఆగిపోదని.. ధైర్యంగా ప్రణాళికతో ముందుకు సాగితే విజయం మీ సొంతం అవుతుందని మానసిక వైద్య నిపుణులు విద్యార్థులకు సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

చదువు విషయంలో తరగతిలో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి.వార్షిక పరీక్షల సమయంలో తమ పిల్లలను చెడు ఆలోచనలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ప్రతీ విద్యార్థికి ఒకటి, రెండు సబ్జెక్ట్‌లపై ఇష్ట ముంటుంది వాటిని వేగంగా చదివేస్తే మిగిలిన వాటికి సమయం దొరుకుతుందని పిల్లలకు అర్థమయ్యే విధంగా టీచర్‌లు, తల్లిదండ్రులు వివరించాలి. సమాజంలోని మహనీయులను మార్గదర్శకత్వంగా తీసుకోవాలని తమ పిల్లల్లో స్ఫూర్తి నిప్పాలి.

ఆత్మస్థైర్యమే తొలి గెలుపు



తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో ప్రథమ స్థానంలో నిలవాలంటూ పిల్లలపై ఒత్తిడి, లక్ష్యాన్ని నిర్దేశించకూడదు. ప్రశాంత వాతావరణంలో చదివే ఏర్పాటు చేయాలి. పరీక్షల సమయంలో ప్రతీ విద్యార్థి కనీసం ఆరుగంటల నుంచి ఎనిమిది గంటలు నిద్ర పోయేలా చూడాలి. పరీక్షల సమయంలో పిల్లలను జంక్ పుడ్‌కు దూరంగా ఉంచాలి,శాఖాహార భోజనం ఉండేలా చూడాలి. ఆత్మస్థైర్యమే విద్యార్థుల తొలి గెలుపు.

– డాక్టర్ విజయ్, మానసిక వైద్యులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి

సోషల్ మీడియాకు దూరంగా

పరీక్షలు పూర్తయేవరకు పిల్లలను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి. ఫోన్ లేదా కంప్యూటర్ అతి వినియోగాన్ని కట్టడి చేయాలి. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లల ముందు టీవీ గాని, ఫోన్ గాని ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. తమ పిల్లలకు ఇంట్లో చదువుకునే విధంగా ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పాలి.

టెలీ మానస్ సేవలు

ఇంటర్, పదవ తరగతి విద్యార్థులకు టెలీ మానస్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం టెలీమానస్ పేరుతో టోల్ ఫ్రీ నంబర్లు 14416, 18008914416 అందుబాటులోకి తీసుకొచ్చారు. వార్షిక పరీక్షల సమయంలో ఈ నంబర్లకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫోన్ చేస్తే మానసిక స్థైర్యాన్ని పెంపొందించి సూత్రాలు, పరీక్షల సమయంలో భయభ్రాంతులకు గురికాకుండా చిట్కాలను నిపుణులు ఫోన్‌లో గాని, తమ సెక్షన్‌లో వివరిస్తారు.